10-03-2025
సోమవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 170 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

## సాధించాం..!
### భారత్‌కే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ
### ముచ్చటగా 3వ సారి విజేతగా భారత్



ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని టీమ్ ఇండియా సొంతం చేసుకుంది. దుబాయ్ వేదికగా ఆదివారం జరిగిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌స్‌లో 252 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశిత 50 ఓవర్లలో మరో ఆరు బంతులు మిగిలి ఉండగానే నాలుగు వికెట్ల తేడాతో టీం ఇండియా చేదించింది. ఆరు వికెట్లు కోల్పోయి 256 పరుగులు చేసింది. 252 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమ్ ఇండియా ఓపెనర్లు రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ తొలి వికెట్ భాగస్వామ్యానికి 105 పరుగులు జత చేశారు. 105 పరుగుల వద్ద మిచెల్ శాంత్నర్ బౌలింగ్‌లో ఫిలిప్స్‌కు శుభ్‌మన్ గిల్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాట పట్టాడు. వన్ డౌన్ బ్యాట్స్‌మన్‌గా వచ్చిన విరాట్ కోహ్లీ.. బ్రేస్‌వాల్ బౌలింగ్‌లో ఎల్‌బీడబ్ల్యూ కావడంతో క్రీజ్‌ను వదిలేశాడు. తర్వాత వచ్చిన శ్రేయాస్ అయ్యర్‌తో కలిసి రోహిత్ శర్మ జట్టు స్కోర్ చకచకా పెంచడానికి ప్రయత్నించారు. ఈ తరుణంలో 122 పరుగుల వద్ద రోహిత్ శర్మ ఔట్ కావడంతో టీమ్ ఇండియా మూడు వికెట్లు కోల్పోయింది. శ్రేయాస్

...మిగతాది 2 లో

## రైతులకి షాక్..
### ఈసారి సగం మందికి రైతు భరోసా డబ్బులు కట్!
### భూమి ఎకరాలు తగ్గించడంతో రైతుల ఆందోళన
### డబ్బులు రాక ఆలస్యం - రైతుల ఆవేదన



జయభేరి, హైదరాబాద్ :

రైతులకు పంట సమయంలో డబ్బులు అందించే ఆర్థిక భరోసా పథకం రైతు భరోసా. ఈ పథకం మొదలు పెట్టిన మొదటి రాష్ట్రం తెలంగాణ. తక్కువ కాలంలోనే ఈ పథకం మంచి సక్సెస్ అయ్యింది. అయితే ఈ పథకాన్ని కొందురు పక్కాదారి పట్టించారని వాదనలు ఉన్నాయి. రైతులకు పంట సమయంలో డబ్బులు అందించే ఆర్థిక భరోసా పథకం రైతు భరోసా. ఈ పథకం మొదలు పెట్టిన మొదటి రైతు తెలంగాణ. తక్కువ కాలంలోనే ఈ పథకం మంచి సక్సెస్ అయ్యింది. అయితే ఈ పథకాన్ని కొందురు పక్కాదారి పట్టించారని వాదనలు ఉన్నాయి. పేదల కంటే డబ్బులు ఉన్న వారికే ఇది ప్రయోజనం అనే విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత బీఆర్ఎస్ పాలన పోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు భరోసా అనేది రైతులకు డబ్బు సాయం చేసే పథకం. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక ఎకరానికి సంవత్సరానికి రూ. 12,000 రెండు

...మిగతాది 2 లో

## ఆఖర్లో వారికి లక్కీ ఛాన్స్
### ఎమ్మెల్సీ అభ్యర్థులను ఖరారు చేసిన చంద్రబాబు



టీడీపీ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాపై సస్పెన్స్‌కు తెర పడింది. ఎవరికి ఛాన్స్ వస్తుందోనంటూ గత కొన్నిరోజులుగా జరుగుతున్న ఉత్కంఠకు సీఎం నారా చంద్రబాబు నాయుడు తెరదించారు. ఏపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు కోసం టీడీపీ నుంచి ముగ్గురు పేర్లను టీడీపీ అధినేత చంద్రబాబు ఖరారు చేశారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బీద రవిచంద్ర, కావలి గ్రీష్మ, బీటీ నాయుడు పేర్లను టీడీపీ ఖరారు చేసింది. ఇప్పటికే ఒక సీటును జనసేనకు కేటాయించగా.. ఇప్పుడు మరో సీటును బీజేపీకి కేటాయించారు.

ఏపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. మొత్తం ఐదు స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా.. రేపటితో నామినేషన్ దాఖలు

...మిగతాది 2 లో



బలహీన వర్గాల రిజర్వేషన్లకు సంబంధించి పురిటిలోనే గొంతు నొక్కాలని సాగుతున్న కుట్రలను బీసీలంతా శక్తియుక్తులు ప్రదర్శించి తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి దేశంలోనే మొట్టమొదటగా తెలంగాణలో పునాది రాయి పడిందని అన్నారు.

## ఇచ్చిన మాట ప్రకారం
## కులగణన
## చేపట్టాం

జయభేరి, హైదరాబాద్ :

17 వ అఖిల భారత పద్మశాలి, 8వ తెలంగాణ పద్మశాలి సంఘం మహాసభల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. దేశం మొత్తంమీద కులగణన జరగాలని, రిజర్వేషన్ల విషయంలో 50 శాతం గరిష్ట నిబంధనను సడలించాలన్న డిమాండ్ కు అనుగుణంగా మొట్టమొదటగా తెలంగాణలో పునాదిరాయి పడిందని అన్నారు. "ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా కులగణన చేపట్టాం. దానిపై కొందరు కావాలని తప్పుల తడక అని విమర్శిస్తున్నారే గానీ తప్పులెక్కడ ఉన్నాయో చెప్పడం లేదు. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో రిజర్వేషన్లు వస్తే పరిపాలన బీసీల చేతుల్లోకి వెళుతుందని, వారి హక్కులను కాలరాయాలని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించి మీ అభ్యున్నతి కోసం పాటుపడుతా. రాజకీయంగా, విద్య, ఉద్యోగ పరంగా పిల్లల భవిష్యత్తు, వృత్తుల కోసం, వృత్తుల్లో నైపుణ్యం పెంచుకోవడం.. వంటి ఉజ్వల భవిష్యత్తు కోసం అవసరమైన ప్రణాళికలతో వస్తే ప్రభుత్వం అండగా నిలబడుతుంది. మీ హక్కులలో గట్టిగా సమిష్టిగా నిలబడండి. స్వర్గీయ కొండాలక్ష్మణ్ బాపూజీ తెలంగాణ కోసం సర్వస్వం త్యాగం చేశారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి సాధించుకోవడమే కాకుండా దానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టుకున్నాం. ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీకి

...మిగతాది 2 లో

## ఎస్ఎల్‌బీసీ ప్రమాదం
### ఒకరి మృతదేహం వెలికితీత



ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరుగుతున్న సహాయక చర్యల్లో పురోగతి కనిపించింది. సహాయక బృందాలు ఓ మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడు టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్‌గా గుర్తించారు. మిగతా ఏడుగురి కోసం గాలిస్తున్నారు. పూర్తి సమాచారం కోసం ఈ ఆర్టికల్ చదవండి. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ప్రస్తుతం అక్కడ జరుగుతున్న సహాయక చర్యల్లో పురోగతి కనిపించింది. ప్రమాదం జరిగిన 100 మీటర్ల దూరంలో డి2 పాయింట్ వద్ద కేరళ జాగిలాలు మనుషుల ఆనవాళ్లను గుర్తించాయి. ఈ క్రమంలో సిబ్బంది అక్కడున్న మట్టిని తొలగించి ఓ మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడు టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్‌గా గుర్తించారు. మిగతా ఏడుగురి కోసం గాలిస్తున్నారు. టన్నెల్ రెస్క్యూ పనులను

...మిగతాది 2 లో



## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరు ఖరారు

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి పేరును బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. తమ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీనియర్ నేత, తెలంగాణ ఉద్యమకారుడి పేరును బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు.

జయభేరి, హైదరాబాద్:

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి పేరును బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. తమ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీనియర్ నేత, తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ దాసోజు శ్రవణ్ పేరును బీఆర్ఎస్

...మిగతాది 2 లో

## శృతి మించుతున్న జానపదం..
## డబల్ మీనింగ్లతో ఆటలు పాటలు...

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## సాధించాం..!

అయ్యర్, అక్షర్ పటేల్ నెమ్మదిగా ఆడుతూ స్కోర్ పెంచడానికి ప్రయత్నించారు. కానీ 48 పరుగులతో శ్రేయాస్ అయ్యర్, 29 పరుగులతో అక్షర్ పటేల్ వెంట వెంటనే ఔటయ్యారు. ఈ దశలో హార్దిక్ పాండ్యా వచ్చి మెరుపులు మెరిపించి 18 బంతుల్లో 18 పరుగులు చేసి జేమ్సియన్ బౌలింగ్‌లో ఆయనకే క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాట పట్టాడు. దీంతో వచ్చిన రవీంద్ర జడేజాతో కలిసి కేఎల్ రాహుల్ నెమ్మదిగా ఆడుతూ వీలు చిక్కినప్పుడు షాట్లు కొడుతూ జట్టు విజయ తీరాలకు చేర్చారు. 49వ ఓవర్ చివరి బంతిని ఫోర్‌గా మలిచి రవీంద్ర జడేజా టీమ్ ఇండియాను గెలిపించాడు. ఆరు వికెట్లు కోల్పోయి టీమ్ ఇండియా 254 పరుగులు చేసింది. కివీస్ బౌలర్లలో మిచెల్ బ్రేస్‌వెల్, మిచెల్ శాంత్నర్ రెండేసి వికెట్లు, కేల్ జమియ్సన్, రచిన్ రవీంద్ర చెరో వికెట్ తీశారు.

## మాట ప్రకారం కులగణన చేపట్టాం

కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టాలన్న విజ్ఞప్తిని పరిశీలించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. తెలంగాణ సాధనలో, తెలంగాణ పునర్నిర్మాణంలో పద్మశాలీల పాత్ర మరువలేనిది. ఈరోజు అనేక మందికి రాజకీయ నిలువనీడనిచ్చింది పద్మశాలీలే. రైతన్నలకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో నేతన్నలకు కూడా ఈ ప్రభుత్వం అంతే ప్రాధాన్యతనిస్తుంది. రాష్ట్రంలో స్వయం సహాయ సంఘాల్లో 65 లక్షల మంది సభ్యులకు ఏటా రెండు నాణ్యమైన చీరలు ఇవ్వాలని నిర్ణయించాం. అందుకు అవసరమైన 1 కోటి 30 లక్షల చీరలను తయారు చేసే బాధ్యత పద్మశాలీలకు అప్పగించాలని నిర్ణయించాం. గత ప్రభుత్వం బకాయి పెట్టిన బతుకమ్మ చీరల బకాయిలు, కరెంటు బకాయిలు, బీమా డబ్బులను ఈ ప్రభుత్వం చెల్లించింది. సోలాపూర్‌లో మన పద్మశాలీ సోదరులే అక్కడ స్థిరపడ్డారు. అక్కడ మార్కండేయ భవన నిర్మాణం కోసం 1 కోటి రూపాయలు మంజూరు చేస్తున్నాం. సోలాపూర్, బీవాండి, వర్లి వంటి అనేక ప్రాంతాల్లో మన సిరిసిల్ల సోదరులు స్థిరపడ్డారు" అని పేర్కొంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం సమిష్టిగా నిలబడాలని పిలుపునిచ్చారు.

## రైతులకి షాక్..

విడతల్లో ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ ఈ పథకం సరిగా అమలు కాకపోవడంతో రైతులు బాగా నిరాశ చెందుతున్నారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో రైతు భరోసా కింద కేవలం 14,300 ఎకరాలకు మాత్రమే సాయం ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ ఈ జిల్లాలో 82,000 ఎకరాల సాగు భూమి ఉంది, 40,960 మంది రైతులకు పట్టా పాస్‌బుక్‌లు ఉన్నాయి. అయినా 64,000 ఎకరాలకు సాయం ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు ఇవ్వాల్సిన డబ్బులు సరిగ్గా సమయానికి రావడం లేదని వాళ్లు బాధపడుతున్నారు. యాసంగి సీజన్‌లో కేవలం 6,410 మంది రైతులకు మాత్రమే రైతు భరోసా డబ్బులు అందాయి. మిగతా వాళ్లు ఎప్పుడు వస్తాయో తెలీక ఎదురుచూస్తున్నారు. ఎకరానికి రూ. 12,000 ఇస్తామని చెప్పినా, అది పూర్తిగా ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఖరారు

అధినేత కేసీఆర్ ప్రకటించారు. ఈ మేరకు నామినేషన్ ప్రక్రియను దగ్గరుండి మరీ పర్యవేక్షించాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆదేశించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం దాసోజు శ్రవణ్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానం సైతం ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, విజయశాంతి పేర్లను ప్రకటించింది. పొత్తులో భాగంగా సీపీఐకి ఒక స్థానాన్ని కేటాయించింది. సీపీఐ తరఫున చాడ వెంకటరెడ్డి పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే సామాజిక పరంగా చూస్తే ఒక ఎస్సీ, ఒక ఎస్టీ, ఒక మహిళకు కాంగ్రెస్ టికెట్ కేటాయించినట్లు అయ్యింది. కాగా, పార్టీలో క్రియాశీలకంగా లేని విజయశాంతికి టికెట్ దక్కడం చర్చనీయాంశం అయ్యింది. వీరంతా సోమవారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేయనున్నారు. పదవుల కోసం తెలంగాణ ఉద్యమకారులు దాసోజు శ్రవణ్, అద్దంకి దయాకర్ ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా దాసోజు శ్రవణ్ ఎన్ని పార్టీలు మారినా మాత్రం అవకాశం దక్కలేదు. 2023లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా దాసోజు, సత్యనారాయణ పేర్లను ఫైనల్ చేసింది. ఈ మేరకు వారి పేర్లను అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు పంపించారు. అయితే గవర్నర్ తిరస్కరించడంతో హైకోర్టును దాసోజు శ్రవణ్ ఆశ్రయించారు. ఈ వివాదం అప్పట్లో సంచలనం సృష్టించింది. కాగా, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు మార్చి 3న నోటిఫికేషన్ విడుదల అయ్యింది. మొత్తం ఐదు స్థానాలకు మార్చి 20న ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల స్వీకరణకు మార్చి 10 చివరి తేదీ. అలాగే మార్చి 11న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. మార్చి 13 వరకూ నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. మార్చి 20న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ నిర్వహిస్తారు.

## ఎస్ఎల్‌బీసీ ప్రమాదం

సీరియస్ గా తీసుకున్న ప్రభుత్వం... ఐఐటీ ఎక్స్‌పర్ట్స్‌తో పాటు కేరళ నుంచి క్యాడవర్ స్నిఫర్ డాగ్స్‌ను కూడా తెప్పించింది. మానవ శరీర అవశేషాలు, కుళ్లిపోయిన మృతదేహాలు, 15 అడుగుల కింద బురదలో కూరుకుపోయిన డెడ్‌బాడీలను సైతం గుర్తించడం, గాలిలో, భూమిలోపల వాసనను పసి గట్టగలిగే సామర్థ్యం కలిగి ఉండడం ఈ డాగ్స్ ప్రత్యేకత. ఈ డాగ్స్‌ను ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన రెండు హెలికాప్టర్లలో కేరళ నుంచి దోమలపెంటలోని టన్నెల్ వద్దకు గురువారం తీసుకొచ్చారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో 16వ రోజు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఇక రోబోల వినియోగం తప్పదని కూడా అధికారులు అంటున్నారు. ఆదివారం జరిగిన రెస్క్యూ ఆపరేషన్‌లో 130 మంది నిపుణుల బృందం పాల్గొంటున్నారు. ఇదిలాఉండగా కృష్ణా జలాలను ఉమ్మడి నల్గొండ, హైదరాబాద్‌కు తరలించేందుకు ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును 2005లో ప్రారంభించిన సంగతి తెలిసిందే. కానీ వాటి పనులు నెమ్మదిగా సాగుతూ వస్తున్నాయి. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఈ పనులు ప్రారంభించగా టన్నెల్ కూలి 8 మంది చిక్కుకుపోవడం సంచలనం రేపింది.


## ఆఖర్లో వారికి లక్కీ ఛాన్స్

గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో టీడీపీ తన అభ్యర్థుల జాబితాను ఖరారు చేసింది. టీడీపీ నుంచి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కావలి గ్రీష్మ, బీద రవిచంద్ర, బీటీ నాయుడు పేర్లను టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఖరారు చేశారు. మొత్తం ఐదు సీట్లలో ఇప్పటికే ఒక సీటును జనసేనకు కేటాయించారు. ఆ పార్టీ నుంచి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబు ఇప్పటికే ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ కూడా దాఖలు చేశారు. అయితే మిగిలిన నాలుగు స్థానాలకు టీడీపీ పోటీ చేస్తుందని భావించగా.. ఆఖరులో అనూహ్యంగా బీజేపీకి ఒక స్థానం కేటాయించారు. బీజేపీ పెద్దల నుంచి ఒత్తిడి రావడంతో ఆఖర్లో ఆ పార్టీకి ఓ సీటు కేటాయించారు. మిగతా మూడు స్థానాలకు టీడీపీ తన అభ్యర్థులను ఖరారు చేసింది. మరోవైపు ఎమ్మెల్సీలుగా ఉన్న యనమల రామకృష్ణుడు, బీటీ నాయుడు, అశోక్‌బాబు, దువ్వారపు రామారావుల పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. అలాగే వైసీపీ ఎమ్మెల్సీగా ఉన్న జంగా కృష్ణమూర్తి ఎన్నికలకు ముందు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. దీంతో 2024 మే 15 నుంచి ఆయన స్థానం ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఐదు సీట్లకు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహిస్తోంది. మార్చి 20న పోలింగ్ జరగనుంది. అయితే ఈ ఐదు ఎమ్మెల్సీ పదవుల కోసం ఎన్డీఏ కూటమిలోని నేతలు భారీగా ప్రయత్నించారు. జనసేనకు ఒక స్థానం కేటాయించడంతో మిగిలిన నాలుగు సీట్ల కోసం టీడీపీ సీనియర్ నేతలు గట్టిగా ప్రయత్నించారు. బీటీ నాయుడు, అశోక్‌బాబు, దువ్వారపు రామారావు, జంగా కృష్ణమూర్తి మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరగా.. గత ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన దేవినేని ఉమా, పిఠాపురం ఎస్వీఎస్ఎన్ వర్మ, జవహర్ వంటి నేతలు కూడా ఎమ్మెల్సీ సీటు ఆశించారు. ఇక వంగవీటి రాధా, కొమ్మాలపాటి శ్రీధర్, బీద రవిచంద్ర, బుద్ధా వెంకన్న, కేఈ ప్రభాకర్, మోపిదేవి వెంకటరమణ, పీతల సుజాత వంటి నేతలు కూడా ఎమ్మెల్సీ పదవి కోసం ప్రయత్నించారు. ముఖ్యంగా దేవినేని ఉమా, ఎస్వీఎస్ఎన్ వర్మ పేర్లు రేసులో బలంగా వినిపించాయి. అయితే బీటీ నాయుడుకు టీడీపీ అధినేత చంద్రబాబు మరోసారి అవకాశం ఇచ్చారు. అలాగే మాజీ స్పీకర్ ప్రతిభా భారతి కుమార్తె కావలి గ్రీష్మకు అవకాశం ఇచ్చారు. ఇక జనసేన, బీజేపీలకు చెరో సీటు పోవటంతో ఈసారి సర్దుబాటు చేయలేకపోయామని టీడీపీ అధిష్టానం మిగతా ఆశావహులకు సర్దిచెప్పినట్లు తెలిసింది. 2027లో ఏడు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతాయని.. అప్పుడు ఛాన్స్ ఇస్తామని సర్దిచెప్పినట్లు సమాచారం.

# శృతి మించుతున్న జానపదం..

## డబల్ మీనింగ్లతో ఆటలు పాటలు...

**రోజు రోజుకి జానపద సాహిత్యంలో ద్వంద అర్థాలకు చోటు ఎక్కువగా దక్కుతుంది. అదే ఆనందం అన్నట్టుగానే నెటీ జన్లు వ్యూస్ ను కూడా అందిస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో సమాజం యువత ఎటువైపు వెళుతుంది అన్న విషయంపై జయభేరి సగర్వంగా అందిస్తున్న కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ రాజకీయ సమగ్ర విశ్లేషణ...**





**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ జానపద చరిత్రలో ఒకనాటి జానపదం బంగారు శిఖరాన్ని అందుకుంటే.. ఇప్పుడున్న నవీన ఆధునిక యువతరానికి జానపదం లోని అనేక అశ్లీల బూతు పదాల కలయికతో సాగే పాటలకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం నేటి యువత వెర్రి పోకడలకు నిదర్శనంగా మారుతుంది.. ఒకవైపు ప్రపంచ మహిళా దినోత్సవం జరుపుకొని మహిళను ఆదిశక్తిగా ఆది దేవతగా నింగిలో సగం నేలలో సగం అన్నిట్లో సగం అని పొగుడుతూ ఇందిరా మహిళా శక్తి పథకాన్ని కూడా ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం గొప్పగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందించిన... మహిళలు దాన్ని దుర్వినియోగం చేసుకుంటున్నారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాగే ఇప్పుడు మనం జానపద సాహిత్యం గురించి మాట్లాడుకుంటున్నా నేపథ్యంలో.. ఒక పాట అని చెప్పడం కాదు గాని ప్రతి ఒక్క పాటలు ద్వందార్థాలు కొట్టొచ్చినట్టుగా ఆడవారే పాడడం మరి విడ్డూరంగా ఉంది... ఆ పాటలు విన్న యువతరం వారి నోట్లో నుంచి కూడా పదాలు పలుకుతుండడం ఈ సమాజం ఎటువైపు దారితీస్తుందో చదువుకున్న యువత ఒకసారి ఆలోచించాలి..

**ఉదాహరణకు ఒక పాట చెప్తామంటే కాంట్రవర్సీ అవుతుందని నేను మాట్లాడడం లేదు కానీ... నాలుగు గోడల మధ్య జరగాల్సిన ఆ సంతోషం కాస్త సాహిత్యంలో చోటు సంపాదించుకొని అశ్లీల పదాలతో అర్థాలు వచ్చే విధంగా పాటలు రాయడం నేటి రచయితలకు పరిపాటిగా మారిపోతుంది.. రచయితలు ఏముంది పైసలిస్తే మేము రాస్తున్నాం అని కొట్టి పారేయొచ్చు. కానీ ప్రొడ్యూస్ చేసే ప్రొడ్యూసర్లు కాస్త మన ఇంట్లోనూ ఆడపిల్లలు ఉన్నారనే ఆలోచనతో మసులుకోవడం ఎప్పుడో మరిచిపోయారు. ఈ దశలో నేను కూడా అక్కడక్కడ ఒక్కొక్క పాట రాసి ఉన్నాను. అందుకు నేను సిగ్గుపడుతున్నాను. ఒకరిని వేలెత్తి చూపేముందు నాలుగు వేలు మనల్ని చూపిస్తాయి కాబట్టి నా తప్పును కూడా ఒప్పుకుంటూ ఇలా రాయాలని నా మనసు చెప్పిన కారణంతో రాస్తున్న..**

జానపదం జనజీవన చిత్రాన్ని ప్రతిబింబించే అద్భుతమైన సాహిత్యం.. పేదవాడి చెమట చుక్కల్లో నుంచి కారిన ఒక్కొక్క అక్షరం మనసుకు హాయినిచ్చి ఆనందాన్ని ఇచ్చి తమ కష్టాన్ని మరిచిపోయే విధంగా సాహిత్యం ఆనాటి రోజుల్లో ఉండేది. కానీ నేడు జానపదం శృతి మించిపోతుంది.. పాడే వాళ్ళు కూడా అలాగే తయారవుతున్నారు.. ఇక సినిమాల్లో కూడా జానపదం చోటు సంపాదించుకున్న ఈ తరుణంలో అలాంటి సాహిత్యమే ఎక్కువ జనాదరణ పొందుతుంది.. దీన్నిబట్టి సమాజం ఏమైపోతే నాకేంటి సంపాదన బాగుంది కదా అనుకునే ప్రొడ్యూసర్లు రోజురోజుకి ఎక్కువ యూతున్నారు.. మాకు అలాంటి పాటలే రాయండి అలాంటి సంగీతాన్ని సమకూర్చండి అని రచయితలపై సంగీత దర్శకులపై గాయకులపై ఒత్తిడి పెంచుతున్నారు. దీని మూలంగా జానపద సాహిత్యంలో ఎక్కువగా బూతు పురాణం ఆవిర్భవిస్తుంది.. ప్రధానంగా జానపద సాహిత్యంలో ఎందుకు చెబుతున్నాను అంటే.. జానపదాలు ఎక్కువగా బడుగు బలహీనవర్గాలు ఆటో నడుపుకునేవాళ్లు కష్టం చేసే వాళ్ళు ఎక్కువగా వినడానికి అవకాశం ఉంటుంది. అలాంటి వాళ్ళ మస్తిష్కం లో చెడు ఆలోచనలు రేకెత్తించే అవకాశం మెండుగా కనిపిస్తోంది.. దీని ద్వారా అత్యాచారాలు మానభంగాలు జరగడం పరిపాటిగా మారిపోతుంది.. చట్టాలు ఎన్ని వచ్చినా సమాజంలో నియంత్రణ స్థాయి మించి పోతుంటే రోజురోజుకు శృతిమించిన జానపదం వెర్రి వేషాలు పడుతూ సముద్రంలో అలలు అలలుగా ఉప్పొంగుతుంటే జరిగేది కంటశోకమే గర్భశోకమే...

జానపదం.. జనం తమ కష్టాన్ని మర్చిపోవడానికి ఆనాడు కష్టం చేసే సమయంలో కష్టాన్ని ఇష్టంగా పాటగా మలుచుకొని ఆ రాగాన్ని ఎంచుకొని పాడే పాటలు మళ్లీ ఇప్పటికీ వస్తున్న ఆ పదాల సాహిత్యంలో అశ్లీల పదాలు అర్థాలు ఇచ్చే సాహిత్యం పరవళ్లు తొక్కుతుంది...

ఒకనాటి రేలారే రేలా పాటను అనేక రకాలుగా చించి విస్తరి ఆకులను పడేసినట్టుగా పడేశారు... ఏదైనా ఒక జానపదం వచ్చింది అంటే అది పాత రాగాలను పట్టుకొని ఇప్పుడేదో తాము సాధించినట్టుగా కొత్త రాగాలను సృష్టిస్తున్నట్టుగా నేటి సంగీత దర్శకులు లేకపోలేదు... ఇక రచయితలకైతే మరీ ముఖ్యంగా అమ్మాయి వదిలేస్తే పడే బాధని రాయమంటూ రచయితలపై దర్శక నిర్మాతలు ఒత్తిడి తీసుకొస్తుండడం.. ఆ వేదనను తన వేదనగా మలుచుకొని రచయితలు రాసి సమాజంలోకి వదిలిన తర్వాత యువత ఆ పాటలు పాడుకుంటూ తమ జీవితాన్ని ఉన్నత చదువుల వైపు మళ్ళించుకోక మధ్యలోనే తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారు... పాట వింటే మనసుకు హాయి కలగాలి. జానపదం జన జీవన చిత్రంలో నుంచి పురుడు పోసుకోవాలి. పక్షుల రాగాలు ప్రకృతి అందాలు నదీ తీరాల అలలహోయలు.. అబ్బో ఒకటి ఏమిటి ఇలా ఎన్నో ప్రకృతి అందాలను వర్ణిస్తూ జానపద కొనసాగితే అది కలకాలం నిలిచిపోతుంది.. ఇలా వచ్చి అలా వెళ్లే ఈనాటి జానపదాలు ప్రేక్షకుల మన్ననలను పొందుకోవడమే లక్ష్యంగా ఎంచుకొని యూట్యూబర్లు ఎక్కువ వ్యూస్ కోసం ఇలాంటి పాటలను ఎంచుకొని ఎగబాకుతుండడం ఇది సమాజానికి చెంపపెట్టు.

**ఒకవైపు సమాజాన్ని రాజకీయ పార్టీలు కులాలు, మతాలు ప్రాంతాలు ఈర్ష ద్వేషాలను రేకెత్తించి పబ్బం గడుపుకుంటూ ఉంటే... ఇంకోవైపు జానపదం శృతి మించిపోయి అశ్లీలత్వాన్ని ప్రదర్శిస్తూ సాగే పాటలలో ఆడవారు వేసే నృత్యాలు మరీ మరీ చూడాలన్నట్టుగా సాగే విధంగా ఉంటూ యువతను పెడదారి పట్టిస్తున్నాయి..**


**మనోవేదనతో ఒక రచయితగా నేను ఆ తప్పులో పాల్గొన్నందుకు మరొక్కసారి క్షమాపణలు చెబుతూ... రాబోయే రచయితలకు రాస్తున్న రచయితలకు సంగీత దర్శక నిర్మాతలకు పాదాభివందనాలు చేస్తూ అలాంటి పాటలను రాకుండా చూడటానికి అవకాశం కల్పించండి... మనసుకు నచ్చే మంచి జానపదాలను అడవి తల్లి అందాలను ప్రకృతి సోయగాలను చెట్టు చేమ పుట్ట నది ప్రాంతం ఊరు తల్లి భార్య చెల్లి ఇలాంటి ఎన్నో అనుబంధాల ఆప్యాయతలను జానపదాల్లో జోడిస్తే వచ్చే పాటలు ఆరోగ్యకరంగా ఆహ్లాదాన్ని కలిగించే విధంగా ఉంటుంది..**

ఇక రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం సాంస్కృతిక శాఖ ఇలాంటి అశ్లీలత బూతు పదాల కలయికలతో వచ్చే పాటలను వెంటనే పరిగణలోకి తీసుకొని వీటిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకొని సమాజానికి కీడు తెచ్చే విధంగా యువత ఆలోచనలను పెడదారి పెట్టే విధంగా ఉన్న పాటలపై నియంత్రణ చేయకపోతే రోజురోజుకీ ఇలాంటి పాటలే ప్రజాదరణ పొందుతూ ప్రతి యువతలో ఆ పాట మరల పాడే అవకాశం కల్పిస్తూ ఆడపిల్లలపై అత్యాచారాలు పెరిగే అవకాశం ఉంది... ఇది గమనించి ప్రభుత్వ అధికారులు పెద్దలు మేధావులు చదువుకున్న వారు యువత ఒకసారి ఆలోచించి మీ అభిప్రాయాన్ని ఇతరులతో పంచుకొని ఇది నిజమా అబద్ధమా అన్న విషయం చర్చించుకుంటే బాగుంటుంది... ఆ చర్చ సమాజంలో జరగాలని ఈ విశ్లేషణ మీ ముందుకు తెస్తున్నాను...



కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్, పొలిటికల్ ఎనలిసిస్టు, కవి, రచయిత, గాయకుడు, సామాజిక ఉద్యమకారుడు

# చంద్రబాబు ఇలా.. జగన్ అలా





**జయభేరి, తిరుపతి, మార్చి 8:**

ఏపీ సీఎం చంద్రబాబుపై అనేక రకాల విమర్శలు ఉండేవి. ఆయన కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వరని... బంధుత్వాలను పక్కన పెడతారని.. అలా చేస్తే మరో రాజకీయ కేంద్రంగా మారుతారని భావిస్తారని.. ఇలా ఎన్నెన్నో ప్రచారాలు ఉండేవి. నందమూరి కుటుంబాన్ని తొక్కేసి ఎదిగారని కూడా ఆరోపణలు ఉండేవి. అయితే క్రమేపీ ఆరోపణలన్నీ కరిగిపోతున్నాయి. ప్రజలకు వాస్తవాలు తెలుస్తున్నాయి. తాజాగా తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావును ఆత్మీయ ఆలింగనం చేసుకుని దగ్గర చేర్చుకున్నారు చంద్రబాబు. తెలుగు నాట ఈ ఇద్దరు తోడల్లుళ్లు మధ్య జరిగిన పొలిటికల్ ఫైట్ అందరికీ తెలిసిన విషయమే. చంద్రబాబును విభేదించే దగ్గుబాటి తనకు తానుగా దగ్గరయ్యారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. టిడిపిసంక్షోభ సమయంలో చంద్రబాబుతో పాటు దగ్గుబాటి కలిసి ఉండేవారు. చంద్రబాబు సీఎంగా, వెంకటేశ్వరరావు మంత్రిగా ఉండేవారు. కార్యక్రమంలో వారిద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయిన వెంకటేశ్వరరావు చంద్రబాబు అంటేనే మండిపడే వారని అందరికీ తెలిసిన విషయమే. అటువంటి వెంకటేశ్వరరావు అదే చంద్రబాబును ఆశ్రయించారు. తమ మధ్య గ్యాప్ ఉండేదని చెప్పుకున్నారు. కానీ కుటుంబం అంటే కలిసిపోవాలి కదా అని అర్థం వచ్చేలా మాట్లాడారు. అటు దగ్గుబాటి పురందేశ్వరి సైతం తన చెల్లెలి భర్త విషయంలో గౌరవంగానే ఉంటున్నారు.

ఆది నుంచి నందమూరి కుటుంబం చంద్రబాబు పట్ల గౌరవభావంతోనే ఉంది. టిడిపిలో సంక్షోభ సమయంలో చంద్రబాబు చేసిన పనికి వెన్నుపోటు అన్నారు. కానీ ఉమ్మడి ఏపీ ప్రజలు ఆశీర్వదించారు. నవ్యాంధ్రప్రదేశ్ ప్రజలు సైతం నమ్మకం పెట్టుకున్నారు. అదే సమయంలో నందమూరి కుటుంబానికి చెందిన హరికృష్ణ బతికున్నంత వరకు బావ చంద్రబాబు తోనే కొనసాగారు. మధ్యలో విభేదించి వెళ్లిపోయిన హరికృష్ణను చేరదీసి రాజ్యసభ పదవి ఇచ్చారు. బాలకృష్ణ ద్వారా నందమూరి కుటుంబాన్ని ఐక్యం చేసి తన వైపు తిప్పుకోగలిగారు. దశాబ్దాలుగా వైరంతో ఉన్న తోడల్లుడు దగ్గుబాటి కుటుంబాన్ని సైతం చేరదీయగలిగారు. అయితే చంద్రబాబు సరే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి ఆ విధంగా చేరదీయగలరా? అనే ప్రశ్న వినిపిస్తోంది. జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా విభేదించారు సోదరి షర్మిల. ముందుగా వ్యక్తిగతంగా సోదరుడికి దూరమయ్యారు. తరువాత రాజకీయంగా రూటు మార్చారు. మొన్నటి ఎన్నికల్లో దారుణంగా దెబ్బతీశారు. మరోవైపు బాబాయ్ వివేకానంద రెడ్డి కుమార్తె సునీత రెడ్డి కూడా జగన్మోహన్ రెడ్డిని విభేదిస్తున్నారు. తన తండ్రి హత్య విషయంలో నేరుగా జగన్మోహన్ రెడ్డిని నిందిస్తున్నారు. మరోవైపు జగన్మోహన్ రెడ్డి తల్లి విజయమ్మ.. కుమారుడు కంటే కుమార్తెకి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే ఇప్పటికిప్పుడు చంద్రబాబు మాదిరిగా ఇంట గెలిచే ఛాన్స్ జగన్మోహన్ రెడ్డికి కనిపించడం లేదు. దానికి మరికొంత సమయం పట్టే పరిస్థితి ఉంది.

### షర్మిల ట్రాప్ లో విజయమ్మ

వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబ ఆస్తుల వివాదం పెను ప్రకంపనలకు దారితీసిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో కుమార్తె షర్మిల వైపు విజయమ్మ నిలిచారు. ఇటీవల సరస్వతి పవర్ వాటాల విషయంలో స్పష్టత ఇచ్చారు. జరిగిన విషయాన్ని మీడియాకు వెల్లడించారు. అయితే దీనిపై తాజాగా స్పందించారు జగన్మోహన్ రెడ్డి. తన తల్లి, సోదరి షర్మిల తో ఆస్తుల వివాదంపై అనేక విషయాలను బయటపెట్టారు. ఇంతటి వివాదానికి కారణం షర్మిల అని వ్యాఖ్యానించారు. షర్మిల అత్యాశతోనే సమస్యలు వస్తున్నాయని వివరించారు. కోర్టు కేసుల దృష్ట్యా వాటాలు అమ్మ పేరిట ఉంచితే.. గిఫ్ట్ డీడ్ లను అడ్డుపెట్టుకొని షర్మిల కాజేయాలని చూస్తోందని జగన్ ఆరోపించారు. అందుకే షర్మిలపై ఒకప్పటి ప్రేమ, ఆప్యాయత ఇప్పుడు లేవని చెప్పుకొచ్చారు జగన్.

కొద్దిరోజులుగా సరస్వతీ పవర్ వాటాల బదలాయింపు వ్యవహారంలో వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జగన్ ఎన్సిఎల్టిలో పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. వాటాల విషయంలో తల్లి విజయమ్మను ముందు ఉంచి షర్మిల వెనుక వ్యవహారం మొత్తం నడిపిస్తోందని చెప్పుకొచ్చారు. షర్మిల తన పంతం నెగ్గించుకోవడానికి అక్రమ చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. వాటాల వివాదంలో తల్లి విజయమ్మ ఆవేదనను అర్థం చేసుకోగలరని పేర్కొన్నారు. తన తల్లి పై గౌరవం ఉందని.. కానీ ఆమె వెనుక ఉండి చెల్లి చేయిస్తున్న అక్రమాలు అడ్డుకోవడానికి పిటిషన్ దాఖలు చేసినట్లు వెల్లడించారు. షర్మిల తీరు తో తనకు చాలా నష్టం జరిగిందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. తన వ్యక్తిగత రాజకీయ, విభేదాలతో తల్లిని అడ్డం పెట్టుకుని వాటాలను బదలాయించడం వల్ల తనకు నష్టం వాటిల్లిందని జగన్ వివరించారు. హైకోర్టులో కేసు పెండింగ్ లో ఉందని.. చేయి దాటకుండా ఉండేందుకు తనతో పాటు భారతి అమ్మ విజయమ్మ ద్వారా ప్రయత్నాలు చేసిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. కానీ అవేవీ ఫలించలేదని చెప్పుకొచ్చారు. అందుకే కోర్టుకు ఆశ్రయించవలసి వచ్చిందని చెప్పారు. షర్మిల ఏ కంపెనీలోనూ పెట్టుబడి పెట్టలేదని, నిర్వహణలో భాగస్వామ్యం కాలేదని వివరించారు. తన తల్లి విజయమ్మను షర్మిల బలి పశువు చేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు జగన్మోహన్ రెడ్డి. మా వాటాలను అక్రమంగా లాక్కోవడానికి షర్మిల ప్రయత్నిస్తున్నారని అఫిడవిట్ లో పేర్కొన్నారు. కంపెనీ చట్టంలోని సెక్షన్ 59 కింద రిజిస్టర్లో పేర్లను మార్చినప్పుడు.. సరైన కారణం ఉంటే జోక్యం చేసుకునే పరిధి ట్రిబ్యునల్ కు ఉంటుందని ఆ పిటిషన్ లో స్పష్టం చేశారు. ఒక పథకం ప్రకారం తన తల్లి విజయమ్మను షర్మిల తెరపైకి తెచ్చారని జగన్మోహన్ రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. గిఫ్ట్ డీడ్ ప్రక్రియ పూర్తి కాలేదని... వాటాల సర్టిఫికెట్లను తల్లి విజయమ్మకు అందజేయలేదని చెప్పారు. చెల్లితో ఉన్న వ్యక్తిగత, రాజకీయ విభేదాలతో ఈ పిటిషన్ వేశామనడం అవాస్తవమని జగన్ పేర్కొన్నారు. కేవలం న్యాయబద్ధంగా తమ ఆస్తులను కాపాడుకునేందుకే ఈ పిటిషన్ వేసినట్లు పేర్కొన్నారు జగన్మోహన్ రెడ్డి. మొత్తానికైతే తన తల్లి ద్వారా షర్మిల బ్లాక్మెయిల్ చేస్తున్నారని అర్థం వచ్చేలా మాట్లాడుతున్నారు జగన్. మరి వారి వివాదం ఎంత దూరం వెళుతుందో చూడాలి.

# ఉచిత వైద్య శిబిరం ఘన విజయం

- మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం వైద్య సేవలు – ప్రజల ఆదరణతో విజయవంతం, ప్రజలకు అండగా RV ఫౌండేషన్
- ప్రజల విశేష స్పందన – భవిష్యత్తులో మరిన్ని శిబిరాలు.. తుంగతుర్తి రవి




**జయభేరి, మేడిపల్లి :**

మహిళలు, చిన్నారుల ఆరోగ్యాన్ని ప్రోత్సహించేందుకు RV ఫౌండేషన్, బాలాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, మిరాకిల్ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ప్రజల అపూర్వ స్పందనతో విజయవంతమైంది. ఈ ఉచిత వైద్య శిబిరం గణేష్ మండపం, బాలాజీ నగర్ కాలనీ, పీర్జాదిగూడ లో ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు జరిగింది. శిబిరానికి అనేక మంది మహిళలు, పిల్లలు హాజరై ఉచిత వైద్య పరీక్షలు, ఆరోగ్య సలహాలు, ఔషధాలు పొందారు.ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యులు, ఆరోగ్య నిపుణులు వివిధ ఆరోగ్య సమస్యలపై ప్రాథమిక వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు, రక్తపోటు, షుగర్ టెస్ట్‌లు, మరియు పోషకాహార సూచనలు అందజేశారు.ప్రత్యేకంగా, మహిళలకు గైనకాలజీ, శిశువులకు పీడియాట్రిక్ సేవలు అందించడంతో పాటు, ఆరోగ్యపరమైన అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా RV ఫౌండేషన్ వ్యవస్థాపకుడు & పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. "మహిళలు, పిల్లల ఆరోగ్య పరిరక్షణ మా ప్రధాన లక్ష్యం. ఈ ఉచిత వైద్య శిబిరం ద్వారా అనేక మంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించగలగడం ఆనందంగా ఉంది. ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఇలాంటి మరిన్ని వైద్య శిబిరాలను నిర్వహించేందుకు మేము కట్టుబడి ఉన్నాం.ఈ సేవలను ఉపయోగించుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. భవిష్యత్తులో ఇంకా విస్తృతంగా ఆరోగ్య కార్యక్రమాలను చేపడతామని హామీ ఇస్తున్నాను." అని అన్నారు.వైద్యుల సేవలకు ప్రజలు విశేషంగా స్పందించారు. పీర్జాదిగూడ ప్రాంత ప్రజలు RV ఫౌండేషన్, మిరాకిల్ హాస్పిటల్, బాలాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.RV ఫౌండేషన్ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తోంది. భవిష్యత్తులో పీర్జాదిగూడ లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో కూడా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమం లో పన్నాల శ్రీనివాస్ రెడ్డి, బండి శ్రీ రాములు, మహిళా అధ్యక్షురాలు శ్రీలత భద్రు నాయక్, ఎన్ ఎస్ కె దుర్గ, బాలాజీ నగర్ కాలనీ కమిటీ సభ్యులు, హాస్పిటల్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ లోని ముఖ్య నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాలనీ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



నాచారం మెయిన్ రోడ్ లో సరస్వతీ కాంప్లెక్స్ లో నూతనంగా ఏర్పాటు చేసిన చాట్ అడ్డ నీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు వ్యాపార రంగంలో రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ సీనియర్ నాయకులు మేడల మల్లికార్జున్ BRS పార్టీ నాయకులు హోటల్ నిర్వహకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, ఉప్పల్**



తుర్క యాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో NSR నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన చలాసాని కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, కళ్యాణ మండపం నిర్మాణ దాత చలాసాని రాజేంద్ర ప్రసాద్, స్థానిక మున్సిపల్ పార్టీ ప్రెసిడెంట్ కొత్త కుర్మ మంగమ్మ, మాజీ కౌన్సిలర్లు రేవల్లే హరిత యాదగిరి, కాకుమాను సునీల్, కోషిక ఐలయ్య, బొక్క రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త కుర్మ శివ కుమార్, గుండ్లపల్లి దన్ రాజ్ గౌడ్, సామ భీమ్ రెడ్డి, కుంట గోపాల్ రెడ్డి, పూజారి శంకర్ గౌడ్, పరుచూరి రాజాబాబు, ఓర్సు శ్రీనివాస్, పన్నాల మధు సూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, తుర్క యాంజాల్**

## పీటీఎస్ ల రాష్ట్ర కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**జయభేరి, ములుగు, మర్చి 09 :**

గ్రంథాలయాల పార్ట్ టైం స్వీపర్స్ (పీటీఎస్) రాష్ట్ర కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ములుగు మండలం బండమైలారంలో రాష్ట్ర గ్రంథాలయాల పార్ట్ టైం స్వీపర్స్ గౌరవాధ్యక్షుడు ఎలగందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా జిల్లాలకు చెందిన వారు పాల్గొన్నారు. అధ్యక్షులుగా పిట్టా హుస్సేన్ (నేరేడుచర్ల బ్రాంచ్), ప్రధాన కార్యదర్శి కస్తాల మధు (హుజూర్నగర్ బ్రాంచ్), ఉపాధ్యక్షులు సిహెచ్ ఎల్లం (ములుగు), హద్నూరు అంకుష్ కుమార్ (సంగారెడ్డి జిల్లా) కోశాధికారిగా ఖమ్మంపాటి మధుసూదన్( పెన్ పహాడ్ బ్రాంచ్) సహాయ కార్యదర్శిగా సయ్యద్ సలీం (ఆసిఫాబాద్ జిల్లా), చెరుకుపల్లి స్వామి (మంచిర్యాల జిల్లా) తోపాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్ట్ టైం స్వీపర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు.

## చెలిమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 76వ కార్యక్రమం



**జయభేరి, గజ్వేల్, మర్చి 09 :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ భారత్ నగర్ లొ నివాసం ఉంటున్న జక్కా నితిన్ వయస్సు 22 సంవత్సరాలు, వృత్తి కారు డ్రైవర్ పనులు ముగించుకొని బైక్ పై సాయంత్రం ఇంటికి వస్తున్న క్రమంలో మద్యం సేవించి నిర్లక్ష్యంగా మోటర్ సైకిల్ డ్రైవింగ్ చేస్తూ ఇతనిని ఢీకొట్టడం వల్ల మొఖానికి తీవ్ర గాయాలు కాగ చికిత్స నిమిత్తం ఆర్ వి ఎం హస్పిటల్ లో చేర్పించారు. అతనిది నిరుపేద కుటుంబం కావున వైద్య ఖర్చుల నిమిత్తం 15 వేల రూపాయలు, దోస్తాంకా గ్యారేజ్ మిత్రులు 5 వేలు రూపాయలు మొత్తం కలిపి 20000 రుపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి చేపూరి సంతోష్, కోశాధికారి దొంతుల ఆనంద్, సభ్యులు గుంటుకు శ్రీనివాస్, పెద్దూరి శ్రీనివాస్, యాట ఆంజనేయులు పాల్గొన్నారు.

## అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీ పట్టివేత




**జయభేరి, మర్చి 9:**

గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని ఎస్ఓటి పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన శామీర్ పేట అవుటర్ రింగ్ రోడ్డు వద్ద జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఏపీ 23 యూ 5899 నెంబర్ గల లారిలో నందిగామ కు చెందిన డ్రైవర్ ఎస్ కే సర్దార్, మరియు క్లీనర్ చంద్రంలు సుమారుగా 25 టన్నుల రేషన్ బియ్యాన్ని ఆటోనగర్ మలక్ పేట్ నుండి సిద్దిపేట్ కు అక్రమంగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో లారీ శామీర్ పేట అవుటర్ రింగ్ రోడ్డు వద్దకు రాగానే ఎస్ఓటి పోలీసులు లారీని ఆపి తనిఖీ చేశారు. కాగా ఈ విషయమై డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో లారీని సీజ్ చేసి శామీర్ పేట పోలీస్ స్టేషన్ కు తరలించారు. అయితే ఈ రేషన్ బియ్యాన్ని గజ్వేల్ కు తరలిస్తున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గా సంజయ్ గుప్తా

**జయభేరి, గజ్వేల్, మర్చి 09 :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త లయన్ సంజయ్ గుప్త లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320 డీ 2025 2026 సంవత్సరానికి సిద్దిపేట జిల్లా రిజియన్ చైర్మన్ గా నియామకమయ్యారు ఆదివారం గజ్వేల్ లో లయన్ సంజయ్ గుప్తా మాట్లాడుతూ లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గా నాకు పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవలను మరింత విస్తృతం చేస్తామని, నాకు ఇచ్చిన ఈ బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తానని అన్నారు, సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్ అని, ప్రతి ఒక్కరు సేవానిరతి కలిగి ఉండాలని అన్నారు.

## తల్లి మందలించిందని కొడుకు బలవన్మరణం



**జయభేరి, వర్గల్, మర్చి 09 :**

తల్లి చదువుకోమని మందలించినందుకు విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లాలో జరిగింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్ రెడ్డి వివరాలిలా.. వర్గల్ మండలం చంద్ ఖాన్ మక్త గ్రామానికి చెందిన మార్కంటి కనకవ్వ భర్త గోపాల్ రెడ్డి వారి కొడుకు విజయేందర్ రెడ్డి (16) చౌదర్పల్లి ఉన్నత పాఠశాలలో 10 తరగతి చదువుతున్నాడు. గురువారం వారి పొలం వద్దకు వెళ్లాడు. దీంతో చదువుకోకుండా ఎందుకు తిరుగుతున్నావు అని తల్లి మందలించింది.అది మనసులో పెట్టుకొని వ్యవసాయ పొలంలో ఉన్న పురుగుల మందును తాగాడు. అది గమనించిన తల్లి గజ్వేల్ గవర్నమెంట్ అసుపత్రి కి తరలించి మెరుగైన చికిత్స కోరకు బేగంపేట్ లోని సన్ షైన్ ఆసుపత్రి కి తరలించారు.చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని తల్లీ ఇచ్చిన పిర్యాదు మేరకు సూసైడ్ కేసు నమోదు చేసినట్లు గౌరారం ఎస్ఐ కర్ణాకర్ రెడ్డి తెలిపారు.

# కార్పొరేటర్ ని ఘనంగా సన్మానించిన కాలనీ వాసులు



**జయభేరి, హయత్ నగర్ :**

హయత్ నగర్ డివిజన్ లోని సూర్య నగర్ కాలనీ లో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారి కృషితో కాలనీ ప్రధాన రోడ్డు మార్గం నిర్మించిన సందర్భంగా కాలనీవాసులు వారిని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హయత్ నగర్ డివిజన్ అభివృద్ధి పరచడం తన యొక్క బాధ్యతని తనపై నమ్మకంతో గత GHMC ఎన్నికల్లో అత్యంత భారీ మెజారిటీతో గెలిపించినందుకు హయత్ నగర్ డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని వారు తెలిపారు.

హయత్ నగర్ డివిజన్ నగర శివారులో ఉండడం వల్ల కాలక్రమేన రోజు అనేకమైన నూతన కాలనీలు ఏర్పడుతుండడంతో మౌలిక వసతుల కొరత చాలా ఉందని, GHMC లో నిధులు లేనప్పటికీ తన శాయశక్తుల ప్రయత్నిస్తూ హయత్ నగర్ డివిజన్ అభివృద్ధి పరచడం జరుగుతుందని, రానున్న రోజుల్లో కూడా హయత్ నగర్ డివిజన్ మరింత అభివృద్ధి పరిచేలా కృషి చేస్తానని వారు తెలిపారు. సూర్య నగర్ ఈస్ట్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు త్వరలోనే పార్క్ అభివృద్ధి పనులు కూడా ప్రారంభమవుతాయని, అదేవిధంగా సూర్య నగర్ ఈస్ట్ కాలనిలో మిగిలి ఉన్న సిసి రోడ్ల సమస్యను కూడా వీలైనంత త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి సంఘీ అశోక్, కాలనీ అధ్యక్షులు యాదగిరి గౌడ్, కానీ సంక్షేమ సంఘం సభ్యులు యాదగిరి రెడ్డి, దశరథ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీశైలం, హుస్సేన్ నాయక్, వెంకట్ రెడ్డి, రాజ వర్ధన్ రెడ్డి, వెంకట్ గౌడ్, శంకర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా "మహిళా దినోత్సవ" వేడుకలు

- ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సింగరెడ్డి పద్మారెడ్డి
- మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్న మహిళలు




**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ పరిధిలోని ఐఐసిటి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు 5వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి, బ్రహ్మకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ తరపున మహిళలను శాలువాలతో ఘనంగా సన్మానించారు.అనంతరం మహిళలు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి పద్మారెడ్డి మాట్లాడుతూ.. మగవారితో సమానంగా ప్రతి రంగంలో అమ్మాయిలు రాణిస్తున్నారని అందుకు ప్రతి తల్లిదండ్రులు మగ ఆడ తేడా లేకుండా తమ పిల్లలను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలని,మహిళల సంరక్షణ కోసం ప్రభుత్వాలు మరింత పకడ్బందీగా చట్టాలను అమలు చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐసిటి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కాలనీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవం

- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- మాజీ సర్పంచ్ రూప్లా నాయక్, జనసేన నాయకులు రాజు నాయక్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**జయభేరి, షాద్ నగర్, మార్చి 09 :**

అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం. షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలంలో కొలిచే భక్తులకు కొంగుబంగారంగా నిలుస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం కేశంపేట మండలం బైర్కాన్ పల్లి గ్రామంలో 300ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవానికి ముఖ్యఅతిథిగా షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ రూప్లా నాయక్, జనసేన నాయకుడు జరుపుల రాజు నాయక్ ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ఘనంగా స్వాగతం పలకడంతో పాటు పూలమాలలు శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 300 ఏళ్ల చరిత్ర కలిగిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో పూజలు చేయడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక చింతనను ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల వైపు భక్తులు ఎక్కువగా శ్రద్ధ చూపిస్తున్నారని గుర్తు చేశారు. మానసిక ప్రశాంతత లభించాలంటే భగవంతుని స్మరించుకోవాలని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ రూప్లా నాయక్ మాట్లాడుతూ బైర్కాన్ పల్లి గ్రామంలో ఏళ్ల చరిత్ర కలిగిన లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఉందని, కొలిచే భక్తుల పాలిట కొంగుబంగారంగా నిలుస్తున్నారని తెలిపారు. నిత్యం అనేక గ్రామాల నుండి భక్తులు స్వామివారి దర్శనార్థం వస్తున్నారని వివరించారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు జరుపుల రాజు నాయక్ తెలిపారు.





## బీజేపీ కేంద్ర మంత్రి వర్యులు బండి సంజయ్ కి ఘన సన్మానం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య, నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి

**జయభేరి, షాద్ నగర్, మార్చి 09 :**

మహబూబ్ నగర్ వెళ్తున్న సందర్భంగా బీజేపీ కేంద్ర మంత్రి వర్యులు బండి సంజయ్ ని షాద్ నగర్ బై పాస్ లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలు బండి సంజయ్ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ, రాష్ట్రంలో బీజేపీ బలపడేందుకు ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. బీజేపీ సిద్ధాంతాలు, ప్రజాసమస్యలపై ఆయన పోరాటం తెలంగాణలో పార్టీకి మరింత బలాన్ని అందించిందని కార్యకర్తలు అభిప్రాయపడ్డారు.

## జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమం




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం నల్గొండ, జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమం రెండు రోజులు జరిగిన జిల్లా స్పోర్ట్స్ మీట్ ముగిసినది. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన PACS చైర్మన్ చిత్రియల జాల నరసింహారెడ్డి, అధ్యక్షులు NVT, సభ్యులతో కలిసి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలో క్రీడాస్థలాలు లేకపోవడం దురదృష్టకరమని, ఉన్న అవుట్డోర్ స్టేడియం అందుబాటులోకి రాకపోవడం, ఇండోర్ స్టేడియం ఆగడం దురదృష్టకరమని అన్నారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ క్రీడాకారులకు కళాకారులకు ఎప్పుడు అండగా ఉంటుందని, అలాగే జాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ కి ఎప్పుడు వెన్నంటి ఉంటానని క్రీడాకారుల కోసం తన చేతనైనంతవరకు సహాయ సహకారాలు అందిస్తానని క్రీడాస్థలాలు అందుబాటులోకి రావడానికి తన వంతుగా సహాయ సహకారాలు ఉంటాయని ఈ సందర్భంగా తెలియజేస్తూ క్రీడాకారులు కళాకారులకు ఎలాంటి అవసరం ఉన్న తనని కలవచ్చని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ఎప్పుడు మీ కండగా ఉంటానని ఈ సందర్భంగా వారన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, రాపోలు నిరంజన్ ,తాళ్ల సురేష్, శ్రవణ్ కుమార్, K సుజాత, కరాటే మాస్టర్ శ్రీను, లీగల్ అడ్వైజర్ ఉమా మహేష్, బత్తుల అమర్, వైయస్ కరుణాకర్, పులిపాటి సన్నీ ,PET లు చరణ్, సంధ్య, కొండల్, డాన్స్ మాస్టర్ జగన్, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## భవననిర్మాణ నిధికి రూ.21,116 అందజేత




**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండలో ఈ రోజు జరిగిన కార్యవర్గ సమావేశం నందు శ్రీమతి చిత్తనూరు పద్మజ రంగయ్య రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ సంఘ సభ్యత్వం తీసుకొని భవన నిర్మాణ నిధికి రూపాయలు 21,116 అందజేసినారు. ఈ సందర్భంగా వారిని శాలువల తో సన్మానం చేసి అధ్యక్ష, కార్యదర్శులు తాడిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళి మాట్లాడుతూ దంపతులకు సంఘం తరపున ధన్యవాదములు తెలియజేసినారు. దాత చిత్త నూరి రంగయ్య పద్మజ మాట్లాడుతూ, సంఘ భవన నిర్మాణం కొరకు కార్యవర్గం, సభ్యులు ఎంత కృషి చేసినారో అర్థంవుతుంది.సంఘ సేవాసదనం చూసిన తరువాత మావంతు ఆర్థిక సహాయం అందజేయాలని అనిపించి అందజేసినాము అన్నారు. అవకాశం ఇచ్చిన పెద్దలందరికి అందరికి కృతజ్ఞతలు తెలిపినారు.జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి మాట్లాడుతూ సంఘం ద్వార సమాజ సేవా కార్యక్రమంలో భాగంగా సభ్యుల పుట్టినరోజు, పెండ్లిరోజుల సందర్భంగా బీదలకు నిత్యావసరం సరుకులు, మహిళా వృద్ధాశ్రమంలో మాతలకు భోజనాలు, పండ్లు, అవసరమైన వస్తూ సామాగ్రి అందజేస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పంగనూరు లింగయ్య, సహ అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, జంపాల యాదగిరి, గుమ్మడవల్లి కోటయ్య, వనం బుచ్చయ్య, లోకేష్, బొలుసాని సత్యనారాయణ, తాడిశెట్టి సుదర్శన్, అలంపల్లి శ్రీనివాసులు, అప్పం వీరయ్య, భారతమ్మ, గంగిరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వదువరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని సాయి రమ్య ఫంక్షన్ హాల్ లో కొండభీమనపల్లి గ్రామానికి చెందిన జెల్ల శ్రీధర్ గౌడ్(SI) వివాహ వేడుకలలో మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని నూతన వదువరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బొడ్డు గోపాల్ గౌడ్, మాజీ ఎంపిటిసి కడారి సైదులు యాదవ , జబ్బు ఉమ్మయ్య యాదవ్, గుండాల వెంకట్ యాదవ్, పగిళ్ల చంద్రయ్య, Sk నిరంజన్, జెల్ల వెంకటేష్ గౌడ్, సయ్యద్, గొట్టుముక్కుల శివ, ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ అభివృద్ధి 30 ఏండ్ల ముందుకెళ్ళింది

- కెసిఆర్ ను ప్రశ్నించే అర్హత కాంగ్రెస్ నాయకులకు ఎక్కడిది
- పదిహేను నెలల కాంగ్రెస్ పాలనలో గజ్వేల్ కు ఒరిగింది శూన్యం
- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

**జయభేరి, గజ్వేల్, మార్చి 09 :**



గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధి విషయంలో కెసిఆర్ ను ప్రశ్నించే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆదివారం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరాతో కలిసి గజ్వేల్ లోని విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం మాట్లాడితే అధికారంలో ఉండి చేసే చేతగాక కెసిఆర్ ను విమర్శించడం మూర్ఖత్వమని అన్నారు.2014కి ముందు దశాబ్దాల పాటు గజ్వేల్ నియోజకవర్గం పాలించిన కాంగ్రెస్ పార్టీ ఈ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యం అని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో పేరుకుపోయిన దశాబ్దాల సమస్యలను, మౌళిక అవసరాలకు శాశ్వత పరిస్కారం చూపిన దార్శనికుడు కెసిఆర్ గారని అన్నారు.గజ్వేల్ ప్రజల చిరకాల వాంఛలైన రైల్వే లైన్, తాగునీరు, సాగునీరు, జిల్లా ఆసుపత్రి,ఎడ్యూకేషన్ హబ్, ఔటర్ రింగ్ రోడ్డు లాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన ఘనత కెసిఆర్ గారిదన్నారు. మీ పాలనలో కనీసం తాగడానికి నీళ్లిచ్చిన పాపాన పోలేదని కానీ గజ్వేల్ నియోజకవర్గాన్ని అన్నపూర్ణగా మార్చేందుకు మల్లన్న సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులను నిర్మించి తాగునీళ్లతో పాటు సాగునీళ్లు అందించిన ఘనత కెసిఆర్ గారిదన్నారు. అన్ని గ్రామాలకు రోడ్లు, తాగునీరు, సీసీ రోడ్లు, సామూహిక భవనాలు ఇలా చెప్పుకుంటూ అనేక మౌళిక వసతుల్ని కెసిఆర్ నిర్మించారాని ఏ గ్రామానికి వెళ్లినా మీకు కనబడతాయని అన్నారు.చేసిన గొప్ప కార్యక్రమాలన్నీ మరిచిపోయి అక్కడక్కడ కోర్టు కేసులతో చిన్న చిన్న కారణాలతో మిగిలిపోయిన 510%పనులను చూపించి కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్టు విమర్శలు చేస్తున్నారని అన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టు నిర్వాసితుల పట్ల కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. దేశంలోనే ఎక్కడ లేనివిధంగా గజ్వేల్ పట్టణంలో ఆర్&ఆర్ కాలనీ నిర్మాణం చేసినప్పటికీ ఇంకా కొన్ని సమస్యలు మిగిలిపోయాయని ముస్లిం స్మశాన వాటికకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులదని అన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నిర్వాసిత గ్రామాల ప్రజల సమస్యలను తీర్చాలని డిమాండ్ చేశారు.

గతంలో నిర్వాసితుల వద్దకు వచ్చి రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇచ్చిన రేవంత్ రెడ్డి గారే ముఖ్యమంత్రిగా బాధ్యత నిర్వహిస్తున్నారని పెద్ద నాయకులు మంత్రులుగా ఉన్నవాళ్లు ఎందుకు మల్లన్న సాగర్ నిర్వాసిత గ్రామాల ప్రజలను మరిచిపోయారో చెప్పాలన్నారు. స్వార్థ రాజకీయాల కోసం మాత్రమే నిర్వాసిత గ్రామాల ప్రజలను రెచ్చగొట్టిన నాయకులు వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపితే బాగుంటుంది అన్నారు. కెసిఆర్ పదేళ్ళ పాలనకు ముందు గజ్వేల్ పరిస్థితి ఏమిటో ఇప్పుడు గజ్వేల్ పరిస్థితి ఏమిటో ఈ నియోజకవర్గ ప్రజలకు తెలుసని అభివృద్ధి విషయంలో ఎక్కడైనా చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని ఎంత చేసినా ఏదో ఒక మూలాన సమస్య మిగిలే ఉంటుందని ఆ సమస్యల్ని పరిష్కరించే బాధ్యత ఇప్పుడు ఉన్న ప్రభుత్వం మీద ఉన్నప్పటికీ వారు దానిని మరిచిపోయి ప్రజల దృష్టి మళ్లించేందుకు కెసిఆర్, హరీష్ రావు గార్లను విమర్శిస్తున్నారని అన్నారు. గజ్వేల్ అభివృద్ధిలో కెసిఆర్, హరీష్ రావు గార్ల పేర్లు చిరస్తాయిగా ఉంటాయని అన్నారు. కాంగ్రెస్ నాయకులకు ఏమాత్రం గజ్వేల్ అభివృద్ధి మీద చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ముఖ్యమంత్రి, మంత్రులను ఒప్పించి కెసిఆర్ గతంలో మంజూరి చేసిన 170 కోట్ల రూపాయల అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుర్చీల కోసం పైరవీల కోసం పోటీపడి మరీ గొడవలు పడుతున్నారు తప్ప ప్రజల సమస్యల పరిష్కారం కోసం మాత్రం పని చేయడం లేదని అన్నారు. కెసిఆర్ హయాంలో గజ్వేల్ ప్రజల విలువ గౌరవం ఎంత పెరిగిందో అందరికీ తెలుసని మీరు చిల్లర మాటలు మాట్లాడినంత మాత్రాన ప్రజల హృదయాల నుండి వారిని వేరు చేయలేరని అన్నారు. ఒక్క గజ్వేల్ నియోజకవర్గం ప్రజలు మాత్రమే కాదు యావత్తు తెలంగాణ ప్రజలు కెసిఆర్ ను గుర్తుచేసుకుంటున్నారు.అనేక అబద్ధపు హామీలని, ఆరు గ్యారంటీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ కాలంలోనే ప్రజలకిచ్చిన హామీలను ఆమలు చేయడంలో పూర్తిగా విఫలం అయిందని అన్నారు. ప్రజలకు ముఖం చూపించి సమాధానం చెప్పలేకనే కెసిఆర్ ను విమర్శిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులకు ప్రజల సమస్యల పట్ల ఏమాత్రం పట్టింపు ఉన్న గజ్వేల్ నియోజకవర్గంలో ఇంకా రైతు ఋణ మాఫీ కాని రైతులు వేలాది మంది ఉన్నారు వారికి ఋణ మాఫీ చేయించండి. రైతు భరోసా, రైతు భీమా ను సకాలంలో అందించే ప్రయత్నం చేయండి. పెళ్ళి ఏడాది గడుస్తున్నా నియోజకవర్గంలో కల్యాణ లక్ష్మి అందక వందలాది మంది ఆడపిల్లల తల్లిదండ్రులు ఎదిరి చూస్తున్నారు వారికి చెక్కులివ్వండి. గజ్వేల్ నియోజకవర్గంలో మిగిలిన అన్ని సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని మీరు చేసినా చేయకున్నా వచ్చే రోజుల్లో కెసిఆర్ ముఖ్యమంత్రిగా మళ్ళీ అధికారం చేపట్టి సమస్యలన్నీ పరిష్కారం చేస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో తప్పకుండ కెసిఆర్ నాయకత్వంలో గజ్వేల్ పునర్వైభవం పొందుతుందని అన్నారు.ఈ సమావేశంలో గజ్వేల్ ప్రజ్ఞపూర్ టౌన్ ప్రెసిడెంట్ నవాజ్ మీరా, మాజీ కౌన్సిలర్లు బొగ్గుల చందు, మార్కంటి కనకయ్య, మామిడి శ్రీధర్, చీరాల మల్లేశం, నాయకులు రమేష్ గౌడ్, ఉమర్, నిజామోద్దీన్, శివ కుమార్, హనుమంత రెడ్డి, అక్రమ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండి

- డ్వాక్రా లోన్ కావాలంటే లంచం ఇవ్వాల్సిందే
- లేదంటే లోన్ డబ్బులు ఇచ్చేది లేదు
- ఎక్కువ మాట్లాడితే మహిళా సంఘం నుండి తీసివేస్తాం
- మహిళా సభ్యులకు గ్రూప్ లీడర్, ఆర్పీల బెదిరింపు
- దొంగ సంతకాలతో లోన్ ఎత్తుకున్న మహిళా సంఘం లీడర్
- మెప్మా అధికారికి గ్రూప్ సభ్యుల పిర్యాదు
- వారు పట్టించుకోకపోవడంతో మెప్మా పీడీకి పిర్యాదు

**జయభేరి, గజ్వేల్, మార్చి 09:**



మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ప్రోత్సహిస్తూ 10 మందితో కలిసి ఓ పొదుపు సంఘాన్ని ఏర్పాటు చేసి వారికి తక్కువ వడ్డీకి రుణాలను అందజేస్తూ ఉంటే కొంత మంది మహిళా సంఘాల లీడర్లు, ఆర్పీల కారణంగా ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరడం లేదు. పైగా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో వీరిని మానిటరింగ్ చేసేందుకు ఈ సంఘాల నుంచి ఓ ఆర్పీని ఎన్నుకుని వారికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించి వారిని ఆర్థికంగా ఎదిగేలా చేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకోవడంతో పాటు వీరికి మున్సిపల్ కార్యాలయంలో మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన) కార్యాలయం ఏర్పాటు చేసి ప్రభుత్వం నుంచి అందే ప్రతీ సౌకర్యాన్ని మహిళలకు చేరేలా చేస్తోంది. అయితే కొంత మంది గ్రూప్ లీడర్ల దుర్బుద్ధి, ఓ ఆర్పీల వల్ల మహిళా సంఘాల సభ్యులు భారీ దోపిడీకి గురవుతున్నారు. వారి అమాయకత్వమే ఆర్పీలకు, మెప్మాసిబ్బందికి ఆదాయవనరుగా మారుతోంది. దీంతో ప్రభుత్వం నుండి వచ్చే ఫలాలు మాత్రం మహిళా సంఘం సభ్యులకు చేరడం లేదు. దీంతో ప్రభుత్వం అనుకున్న లక్ష్యాలు కింది స్థాయి వరకు చేరకుండా నీరుగారిపోతున్నాయి. దీనిపై ప్రశ్నించిన మహిళా సంఘాల సభ్యులను బెదిరింపులకు పాల్పడుతూ దబాయిస్తున్నారు. ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండంటూ హెచ్చరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే గజ్వేల్ పట్టణానికి చెందిన 8 మంది మహిళా సభ్యులు గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీ లక్ష్మాపూర్ కి చెందిన ఇద్దరు మహిళా సభ్యులతో కలిసి 5 సంవత్సరాల క్రితం అయేషా మహిళా సంఘం ఏర్పాటు చేసుకున్నారు. ఈ మహిళా సంఘానికి గజ్వేల్ పట్టణానికి చెందిన శభానను ఫస్ట్ లీడర్ గా ఎన్నుకున్నారు. గత సంవత్సరం మే 30 న 10 మంది మహిళా సంఘం సభ్యులకు కలిపి వీరి గ్రూప్ కి రూ.6,00,000/ లక్షలు లోన్ మంజూరయ్యింది. ఈ లోన్ విషయంలో అయేషా మహిళా సంఘం సభ్యులైన ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన యాస్మిన్, రహీమున్నీసాలు గ్రూప్ లీడర్ శభానను అడగగా లోన్ కావాలంటే ఇద్దరు సభ్యులు కలిసి రూ.5000 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు వారు తెలిపారు. ఎందుకు ఇవ్వాలని అడగగా మీరు నాన్ లోకల్ అని మీరు మీటింగ్ కి సరిగా రావడం లేదు కాబట్టి రూ.5000 ఇస్తేనే లోన్ వస్తదని బెదిరించినట్లు చెప్పారు. ఎక్కువ మాట్లాడితే గ్రూప్ నుండి తీసివేస్తామని ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండని దబాయించినట్లు తెలిపారు. అయేషా మహిళా సంఘానికి మంజూరైన రూ. 6 లక్షల రూపాయలను ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన ఇద్దరు సభ్యులకు తెలియకుండా తీర్మానం లెటర్ పై వారి దొంగ సంతకాలతో బ్యాంకు మేనేజర్ తో కుమ్మక్కై 8 మంది మహిళా సభ్యులు పంచుకున్నారన్నారు. ఇదే విషయంపై ఆర్పీ జ్యోతిని అడగగా గ్రూప్ లీడర్ శభాన చెప్పినట్లు రూ.5000 వేలు ఇస్తే లోన్ వస్తుందే కదా అంటూ నిర్లక్ష్యపు సమాధానం చెప్పినట్లు తెలిపారు. గతంలో కూడా స్త్రీనిది లోన్ ఇప్పిస్తా అని మా దగ్గర రూ.2000 వేలు తీసుకుందని, మరల స్త్రీనిది లోన్ కొరకు రూ. 2000 అడగగా మేము ఇవ్వలేదని దీంతో స్త్రీనిది లోన్ ఇప్పించక పోగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వలేదన్నారు. ఈ క్రమంలో అయేషా మహిళా సంఘం లీడర్ శభాన, ఆర్పీ జ్యోతి చేస్తున్న అక్రమ వసూళ్లపై బాధితులు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా అధికారి సరితకు రాత పూర్వకంగా పిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఇన్ని నెలలుగా తమకు న్యాయం జరగకపోవడంతో ఈనెల 6వ తేదీన బాధితులు యాస్మీన్ బేగం, రహీమున్నీసాలు మెప్మా పీడీ హన్మంతరెడ్డికి పిర్యాదు చేశారు. వారి సమస్యను విన్న హన్మంతరెడ్డి త్వరలోనే వారి సమస్యను పరిష్కరించి వారికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



## అప్పుల బాధతో వ్యక్తి మృతి

**జయభేరి, వర్గల్, మార్చి 09:**

అప్పుల బాధతో పురుగుల మందు తాగి వ్యక్తి చనిపోయిన ఘటన వర్గల్ మండలంలో చోటుచేసుకుంది. గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలపిన వివరాల ప్రకారం, మండలం లోని సీతారాంపల్లి గ్రామానికి చెందిన తూప్రాన్ వెంకటేశం(42 )భార్య మంజుల, వారికీ ఇద్దరు కూతుర్లు ఉన్నారు. తన పెద్ద కూతురి పెళ్లి సం" కింద చేశాడు. పెళ్లి కోసం సుమారు రు 2,00,000/ వరకు అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలి అని బాధపడుతూ ఆదివారం పురుగుల మందు తాగడు. వెంటనే వారి కుటుంబ సబ్యులు గజ్వేల్ గవర్నమెంట్ ఆసుపత్రి కి తరలించి మెరుగైన చికిస్తా కోసం లక్ష్మక్కపల్లి ఆర్వియం ఆసుపత్రి కి తరలించారు.చికిస్తా పొందుతూ ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో వెంకటేశం మృతి చెందాడు. ఇట్టి విషయం పై మృతుని భార్య మంజుల ఇచ్చిన పిర్యాదు పై సూసైడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## జోరుగా అక్రమ నిర్మాణాలు..!

- కాప్రా సర్కిల్లో చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు..!?
- చర్యలు తీసుకుంటారా.. లేదా? ప్రశ్నిస్తున్న స్థానిక ప్రజాసంఘాలు..



**జయభేరి, కాప్రా, మార్చి 09 :**

కాప్రా సర్కిల్లో అనుమతులు లేకున్నా.. తమకు నచ్చినట్టుగా యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేసుకుంటున్నరు. అక్రమ షెడ్ల నిర్మాణాలు చేపట్టడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం..? ఇక వివరాల్లోకి వెళితే కాప్రా సర్కిల్ పరిధి సౌత్ కమలానగర్, అయ్యప్ప స్వామి టెంపుల్ రోడ్, అన్నపూర్ణ కాలనీ, మౌలాలి లో ఎలాంటి అనుమతులు లేవు. ఆయినా సరే అక్రమ కట్టడాలు కొనసాగుతున్నాయి. ఇక ఈ అక్రమ నిర్మాణదారుడికి ఎలాంటి జంకు, భయం, గౌరవం బిడియం లేకుండా నేను ఇంతే అనే రీతిలో అక్రమ నిర్మాణం కొనసాగిస్తూనే ఉన్నాడు. అంటే అధికారులకు అడిగింది ఇచ్చుకున్న, ఇక నాకేంటి భయం..? యధేచ్ఛగా అక్రమ షెడ్లు నిర్మాణాలు చేసుకోవచ్చు! అనే రీతిలో తన పని తాను చేసుకుంటూ అక్రమ షెడ్లు నిర్మాణాలకు ఆజ్యం పోస్తున్నడు.. స్థానికులు జిహెచ్ఎంసి అధికారులపై టౌన్ ప్లానింగ్ అధికారిపై అవినీతి ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోకపోతే పై అధికారులకు తెలియజేయాల్సి ఉంటుందని స్థానికులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# వైభవంగా విమాన గోపుర సుదర్శన ప్రతిష్ట

- మహా కుంభాభిషేకం,పూర్ణాహుతి కార్యక్రమలు.
- కన్నుల పండుగగా శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణం
- అన్న ప్రసాద దాతలు మురికి అరుణ శ్యాంసుందర్ రావు దంపతులు కుటుంబ సభ్యులు

**జయభేరి, మార్కుక్, మార్చి 09 :**



మర్కూక్ మండలం పాములపర్తి గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవములు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడవ రోజు ఆదివారం సుదర్శన చక్ర ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఉదయం 9 గంటల 36 నిమిషాలకు పునర్వసు నక్షత్ర యుక్త మేష లగ్న సుముహూర్తమైన విమాన గోపుర సుదర్శన ప్రతిష్ట అంగరంగ వైభవంగా వేద పండితులచే వేదమంత్రాల మధ్య అట్టహాసంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీరామ్ జై రామ్ జై జై రామ్ అంటూ నినాదాలతో పాములపర్తిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం సీతారామచంద్ర స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణం వేద పండితులు తిగుళ్ల సనాతన సారధి మంత్రోచ్చనులతో ఆలయ వ్యవస్థాపకులు హనుమంతరావు గీత దంపతులు అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా నిర్వహించారు.

అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం అన్న ప్రసాద దాతలు మురికి అరుణ శ్యాం సుందర్ రావు దంపతులు కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిలుగా మాజీ ఎఫ్ డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సింగం సత్తయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దేశాయి రాజశేఖర శర్మ, కార్తీక్ శర్మ, బిజెపి మండల అధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తాడూరి మహేష్ గౌడ్, చకిలం పుండరీకం, బెల్దే కృష్ణమూర్తి, బేతి వెంకటరెడ్డి, బేతి నరేందర్ రెడ్డి, బేతి కిష్టారెడ్డి, అర్థం లక్ష్మణ్, యాంసాని శ్రీనివాస్, తలకొక్కుల రాములు, గచ్చుబాయి సాధుల్ల గౌడ్, వెంకటేష్ గౌడ్, బెల్దె అశోక్, బెల్దె వెంకటేష్, బచ్చు ఆంజనేయులు, క్రాంతి కుమార్, ఉప్పరి నర్సింగరావు, ఎదెల్లి మల్లేశం, కిష్టగౌడ్, తలకొక్కుల ప్రభాకర్, దుర్గాప్రసాద్ గౌడ్, జుట్టు సుధాకర్, కుమ్మరి కరుణాకర్, బేతి భాను ప్రకాష్ రెడ్డి, జర్నలిస్ట్ ముమ్మడి దొడ్డచారి, సోమ వెంకటేశం, రవి, శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ భక్త బృందం, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అనుకోని అతిథికి మెగా సత్కారం

ఈ స్టిల్ చూసినవారంతా.. మెగాస్టార్ 'విశ్వంభర'లో శ్రీలీల స్పెషల్ సాంగ్ చేస్తున్నదా? అనే డౌట్ రాక మానదు. అసలు విషయం ఏంటంటే.. చిరంజీవి 'విశ్వంభర' షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ అన్నపూర్ణ ఏడెకరాల్లో జరుగుతున్నది. అదే స్టూడియోలో మరో షూటింగ్‌లో ఉన్న శ్రీలీలకు.. పక్క సెట్‌లో మెగాస్టార్ ఉన్నారని తెలిసింది. అంతే.. ఆనందం ఆపుకోలేక 'విశ్వంభర' సెట్‌లోకి ఎంట్రీ ఇచ్చేసింది శ్రీలీల. చిరంజీవిని కలిసి పాద నమస్కారం చేసేసింది. మహిళా దినోత్సవం రోజున అనుకోకుండా వచ్చిన ఈ అతిథిని మెగాస్టార్ గౌరవంగా శాలువా కప్పి సత్కరించారు. అంతేకాక దుర్గాదేవి రూపం ముద్రించిన ఓ శంఖాన్ని కూడా బహూకరించారు. మెగాస్టార్ నుంచి ప్రత్యేకమైన బహుమతిని అందుకున్న శ్రీలీల.. ఆనందం వ్యక్తం చేస్తూ.. చిరంజీవితో ఉన్న ఫొటోలను తన సోషల్ మీడియా అకౌంట్‌లో షేర్ చేశారు. అదనమాట విషయం.





## ఎవరు చేయిస్తున్నారో నాకు తెలుసు..

బాలీవుడ్ బ్యూటీ నోరా ఫతేహి తాను చేసిన ఐటం సాంగ్స్‌తో ఎంతగా గుర్తింపు సంపాదించుకుందో అందరికీ తెలిసిందే. గుర్తింపు అయితే బాగానే వచ్చింది కానీ.. వాటి వల్ల నయా పైసా లాభం చేకూరలేదట. కెరీర్ ప్రారంభంలో గుర్తింపు కోసం అలా ఐటం సాంగ్స్ చేసిందట. కానీ ఆ టైంలో నిర్మాతలు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదట. కానీ తాను చేసిన ఐటం సాంగ్స్ వల్ల సినిమాకు మంచి పేరు వచ్చి, ఆ పాటలు, వీడియో సాంగ్స్ ద్వారా కూడా నిర్మాతలకు డబ్బులు వచ్చాయని, కానీ తనకు మాత్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని చెప్పుకొచ్చింది.
ఇక ప్రస్తుతం నోరా ఫతేహి కేవలం పేరు కోసం కాకుండా డబ్బుల కోసం పని చేయాలని ఫిక్స్ అయిందట. డబ్బులు లేకపోతే తన ఫ్యామిలీని ఎలా పోషించాలని నిలదీస్తోంది. అందుకే ఇకపై రెమ్యూనరేషన్ విషయంలో కాస్త స్ట్రిక్ట్‌గా ఉంటుందని సమాచారం. ఇక తనపై చేస్తున్న నెగెటివ్ క్యాంపైన్ మీద కూడా నోరా మండి పడింది. వేరే ఎవరో ఐటం సాంగ్స్ చేస్తే.. ఐటం పాటలు వస్తే.. తనతో ఎందుకు పోల్చుతున్నారని, షీ కెన్ ఈట్ 100 నోరా అని ఇలా కామెంట్లు ఎవరో పెట్టిస్తున్నారో తనకు తెలుసు అని నోరా చెప్పుకొచ్చింది.



## సోషల్ మీడియా నేపథ్యంలో..

రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వ పర్యవేక్షణలో రూపొందిన చిత్రం 'శారీ'. గిరికృష్ణ కమల్ దర్శకుడు. రవిశంకర్ వర్మ నిర్మాత. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌లో సత్య యాదు, ఆరాధ్యదేవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ నెల 21న పానిండియా స్థాయిలో సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా మేడ్చల్‌లోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్స్ కళాశాల విద్యార్థులతో చిత్రబృందం ఇంటరాక్ట్ అయ్యారు. అగ్రదర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ, హీరోహీరోయిన్లు సత్య, ఆరాధ్యదేవి, నిర్మాత రవిశంకర్‌వర్మ, రామ్‌గోపాల్‌వర్మ సోదరి విజయ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రస్తుత సమాజంపై సోషల్‌మీడియా ప్రభావం ఎంతవరకు ఉంది అనే విషయంపై విద్యార్థుల అభిప్రాయాలను చిత్రబృందం తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెండువేల మంది విద్యార్థులు, కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు. సమాజంపై సోషల్‌మీడియా విష ప్రభావం ఎలాంటి పరిణామాలకు దారితీస్తున్నది? అనే అంశంపై తీసిన సినిమానే 'శారీ' అనీ, నిజజీవిత సంఘటనల ఆధారంగా ఈ సినిమా చేశామని రామ్‌గోపాల్‌వర్మ తెలిపారు. ఇంకా చిత్ర యూనిట్‌సభ్యులంతా మాట్లాడారు.



## మరీ.. ఇలా ఉన్నారేంట్రా.. 'ఛావా' సినిమా చూసి నిధి తవ్వడానికి వెళ్లిన ఊరి ప్రజలు

బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్ నటించిన 'ఛావా' సినిమా బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం 2025 ఫిబ్రవరి 14న విడుదలై సూపర్ హిట్ అందుకోవడమే కాకుండా.. రూ.450 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా చూసిన ఒక ఊరి ప్రజలు నిధి కోసం తవ్వడానికి ఏకంగా పలుగు, పారలు పట్టుకుని బయలుదేరారు.
ఈ సినిమాలోని ఒక సన్నివేశంలో, శంభాజీ మహారాజ్‌ను ఓడించిన తర్వాత మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ మరాఠా రాజుల వద్ద ఉన్న నిధిని దోచుకుని, దాన్ని మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్‌లో ఉన్న అసిర్‌గఢ్ కోటలో దాచినట్లు చూపించారు. అయితే అక్కడ నిజంగానే నిధి ఉందని నమ్మిన బుర్హాన్‌పూర్ ప్రజలు తవ్వకాలు ప్రారంభించారు. మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్ ప్రాంతంలో వందలాది మంది స్థానికులు పారలు, పలుగులు, జల్లెడలతో కోట చుట్టూ రాత్రిపూట తవ్వడం మొదలుపెట్టారు. సాయంత్రం 7 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు ఈ తవ్వకాలు జరిగాయని, దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.
ఇక ఈ ఘటన సినిమా ప్రభావం వలన ప్రజలు ఎంతగా ప్రేరేపితులవుతారో స్పష్టం చేసింది. అయితే, అధికారులు ఈ తవ్వకాలను గమనించి, ప్రజలకు వాస్తవాలను వివరించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ సినిమా దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ మాట్లాడుతూ.. ఛావా సినిమా కేవలం కల్పితం మాత్రమే సినిమా మొత్తం నిజం కాదని వెల్లడించాడు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com